## స్వయంభూమూర్తులకు నిత్యారాధనలు

అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 27 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి కల్యాణోత్సవ సేవను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్వామి, అమ్మవార్లను ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి ఆలయ తిరుమాఢవీధుల్లో ఊరేగించారు. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించి స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. స్వయంభూమూర్తులకు నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నారసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. గంటన్నరపాటు అర్చక బృందం శాస్త్రోక్తంగా కల్యాణ తంతు జరిపారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్‌సేవతోపాటు అండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవను ఘనంగా చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.8,48,431 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

- పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

మోటకొండూర్, సెప్టెంబర్ 27: యాదగిరిగుట్ట పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జేవైఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలేరు నియోజకవర్గ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు శుక్రవారం సన్మానం చేశారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజాన్ని చీకట్లో నుంచి వెలుగులోకి తెచ్చే ఉపాధ్యాయులను ఎప్పుడూ గౌరవించాలన్నారు. ఉపాధ్యాయులు తమ విజ్ఞానాన్ని పంచి సమాజానికి వెలుగులు అందిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రుల తర్వాత అంతటి గౌరవం సమాజం ఉపాధ్యాయులకు ఇచ్చిందన్నారు.

## విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 27 : విద్యుత్ సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని శేరిల్లా గ్రామ పరిధిలో రూ.2.80కోట్లతో నిర్మించిన 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం రాత్రి అయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో విద్యుత్ అత్యవసర సమస్యల పరిష్కారానికి రూ.20కోట్లు మంజూరయ్యాయన్నారు. ప్రజలకు నాణ్యతతో కూడిన విద్యుత్ అందించాలని అధికారులకు సూచించారు. అంతకుముందు చౌటుప్పల్‌లో విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎత్తు తక్కువగా ఉన్న పోల్స్‌ను సరిచేసి గుర్తింపు లేని సర్వీసులను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ సుధీర్‌బాబు, చౌటుప్పల్ డీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఏడీ శ్యామ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

విద్యార్థుల సైన్స్ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 27 : జిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో భువనగిరి ఖిలా వద్ద శుక్రవారం జిల్లా స్థాయి సాంస్కృతిక యువజనోత్సవాలు, ప్రపంచ పర్యాటక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొని మాట్లాడారు. భువనగిరి ఖిలాను అభివృద్ధి పరుచాలన్నారు. జిల్లా యువజన, క్రీడల అధికారి కె.ధనుంజనేయులు మాట్లాడుతూ భారతదేశం తన ప్రాచీన ఔన్నత్యాన్ని పొందాలని ఆశించిన వారిలో ముఖ్యుడు స్వామి వివేకానంద అన్నారు. రామకృష్ణ మఠాన్ని స్థాపించి దాని ద్వారా భారత యువతకు దిశానిర్దేశం చేశారని తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ స్టాల్‌ను పరిశీలించారు. క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్కియాలజీ ఏడీ నాగలక్ష్మి, యువజన సంఘం ప్రెసిడెంట్ కరుణ్, కార్యాలయ సిబ్బంది హెరిటేజ్ కమిటీ సభ్యుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పీఆర్‌సీ ప్రకటించాలి : టీఎస్‌యూటీఎఫ్

ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు రుషి

బొమ్మలరామారం, సెప్టెంబర్ 27 : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల డీఏలు, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు డీవీ రుషి అన్నారు. మండలంలో శుక్రవారం సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ 25ను సవరించాలని, కేజీబీవీ, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు మినిమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు అందించాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జీవీ రమణారావు, మండల శాఖ అధ్యక్షుడు గంగరాజు సిద్ధులు, నాయకులు రమణారావు, సుదర్శన్‌రెడ్డి, శివ, నారాయణ, బాలరాజు పాల్గొన్నారు.

## గౌడ సంఘం భవనానికి శంకుస్థాపన

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 27 : మండలంలోని గుండ్లబావి గ్రామపంచాయతీ పరిధి రెడ్డిబావి గ్రామంలో గౌడ సంఘం భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో రూ.10లక్షల హెచ్ఎండీఏ నిధులతో భవన నిర్మాణం చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పబ్బు రాజుగౌడ్, బోయ దేవేందర్, ఆకుల ఇంద్రసేనారెడ్డి, సుర్వి నర్సింహగౌడ్, గంగాపురం వెంకటేశం పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి
- జిల్లా వ్యాప్తంగా బాపూజీ జయంతి వేడుకలు


ఆలేరు టౌన్ : బాపూజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 27 : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా ఆలేరులోని మార్కండేయ దేవాలయం సమీపంలో గల బాపూజీ ప్రాంగణంలో శుక్రవారం ఆయన విగ్రహానికి చేనేత కళాకారులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యమ నేత కేసీఆర్‌కు ఆఫీస్ లేదంటే లక్ష్మణ్ బాపూజీ తన సొంత భవనాన్ని ఇచ్చిన మహనీయుడన్నారు. పద్మశాలీల అభ్యున్నతికే కాకుండా యావత్ సమాజానికి సేవలందించిన మహనీయుడు బాపూజీ అని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు పుట్ట మల్లేశ్ గౌడ్, గంగుల శ్రీనివాస్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ మొగులుగాని మల్లేశంగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

### బాపూజీ జీవితం స్ఫూర్తిదాయకం

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట : కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండల కేంద్రంలోని బాపూజీ విగ్రహం వద్ద శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి పదవికి రాజీనామా చేసి తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పాల్గొన్న నిజమైన నాయకుడన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నీల దయాకర్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, పట్టణ ప్రధాన కార్యదర్శి జాడ సంతోష్, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

### లక్ష్మణ్ బాపూజీకి ఘన నవాళి

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు, పార్టీలు, ప్రజాసంఘాల్య లయాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రామన్నపేటలో బాపూజీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

ఆలేరు రూరల్ : బాపూజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్

సంస్థాన్ నారాయణపురంలో లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

చౌటుప్పల్ : బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు

వలిగొండ: ఎంపీడీఓ కార్యాలయంలో లక్ష్మణ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీఓ

భూదాన్ పోచంపల్లి : లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ఆత్మకూరు(ఎం) : లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

బొమ్మలరామారం : లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, సిబ్బంది

మోత్కూరులో బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎంపీడీఓ నిరంజన్ పలీ

## యువకుడు అదృశ్యం

చౌటుప్పల్, సెప్టెంబర్ 27 : మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. తంగడపల్లికి చెందిన మహ్మద్ సమీర్‌ఖాన్ (20) ఈ నెల 26న మధ్యాహ్నం బ్యాంకులో నగదు విత్‌డ్రా చేసేందుకు చౌటుప్పల్ ఎస్‌బీఐ బ్యాంకుకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. సమీర్‌ఖాన్ తండ్రి యూసుఫ్‌ఖాన్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

### ఎల్లగిరిలో మరొకరు..

చౌటుప్పల్ మండలంలోని ఎల్లగిరి గ్రామంలో ఒకరు అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎల్లగిరికి చెందిన జెర్రిపోతుల నర్సింహులు (57) మానసిక దివ్యాంగుడు. కొన్నిసార్లు ఇంటి నుంచి బయటకు వెళ్లి కొద్ది రోజులకు తిరిగి వచ్చేవాడు. గత నెల 17న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇండ్లల్లో వెతికినా ప్రయోజనం లేదు. అతని భార్య యాదమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

## నెలవారీ విద్యుత్ బిల్లు రూ.33,248

- నివ్వెరపోయిన వినియోగదారుడు

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 27 : ఆలేరు నుంచి కొలనుపాక రోడ్డులో గల దొంతిరి సోమిరెడ్డి గార్డెన్‌కు విద్యుత్ శాఖ ఊహించని షాక్ ఇచ్చింది. వందల్లో రావాల్సిన నెలవారీ కరెంటు బిల్లు వేలల్లో రావడంతో గార్డెన్ యాజమాన్యం నివ్వెరపోయింది. 33,243 రూపాయల బిల్లును గార్డెన్ యజమానికి పంపి చెల్లించాలని విద్యుత్ అధికారులు ఒత్తిడి తీసుకొచ్చారు. అంత బిల్లు ఎలా వచ్చిందని బాధితుడు సోమిరెడ్డి అధికారులను ప్రశ్నించగా విచారణ జరుపుతామని పేర్కొన్నారు. డిసెంబర్ నుంచి వస్తున్న బిల్లును అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బిల్లును పరిశీలించాక సవరిస్తామని చెబుతూ కాలం గడిపిన అధికారులు మరోసారి లక్ష రూపాయల వరకు బకాయి పేరుకొని ఉన్నట్లుగా విద్యుత్ శాఖ అధికారులు చూపించారు. తనకు అన్యాయంగా వచ్చిన బిల్లును తగ్గించి వినియోగించిన విద్యుత్‌కు మాత్రమే బిల్లు ఇవ్వాలని సోమిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయంపై కలెక్టర్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని ఆయన కోరుతున్నారు.

## బీటీ రోడ్డు నిర్మించాలి

### సీపీఎం నాయకుల రాస్తారోకో

రామన్నపేట, సెప్టెంబర్ 27 : గొల్లెపల్లి – గుండ్రాంపల్లి రోడ్డు గుంతలమయంగా మారిందని, బీటీగా మార్చాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వనం ఉపేందర్, మండల కార్యదర్శివర్గ సభ్యుడు కూరెళ్ల నర్సింహాచారి అన్నారు. మండలంలోని వెల్లంకి గ్రామంలో సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో ఎంపీడీఓ యాకూబ్‌నాయక్‌కు, నలగొండ ఆర్‌టీసీ రీజినల్ మేనేజర్ రాజశేఖర్‌కు వినతిపత్రాలు అందజేశారు. అలాగే రామన్నపేట – చౌటుప్పల్ బస్సును ఉదయం నుంచి సాయంత్రం వరకు పాత పద్ధతిలోనే నడుపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి అవనగంటి నగేశ్, నాయకులు స్వామి, సంతోష్, మహేశ్, రాజలింగం, నవీన్, నర్సింహ పాల్గొన్నారు.

## చేనేత సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 27 : చేనేత సహకార సంఘం అభివృద్ధికి పారిశ్రామికులందరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని చేనేత డైహౌస్ భవనంలో శుక్రవారం జరిగిన చేనేత సహకార సంఘం వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ వర్తింపజేసేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారుల అభిరుచుల మేరకు కొత్త డిజైన్లతో నాణ్యతతో వస్త్రాలు రూపొందించాలని సూచించారు . సంఘంలో నిల్వ ఉన్న వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకుడు తడక వెంకటేశం, సంఘం మాజీ అధ్యక్షుడు భారత వాసుదేవ్, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, ఎన్‌డీసీసీ బ్యాంకు మేనేజర్ ఇందిర, సిల్క్ యారన్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరెపల్లి రవీందర్, సంఘం అధ్యక్షుడు రుద్ర ఆంజనేయులు, నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## అనుమతి లేని మెడికల్ షాపు తనిఖీ

- రూ.30వేల విలువైన మందులు సీజ్

దత్తప్పగూడెంలో మందులు సీజ్ చేసిన డ్రగ్స్ అధికారులు

మోత్కూరు, సెప్టెంబర్ 27 : మండలంలోని దత్తప్పగూడెంలో లైసెన్స్ లేకుండా మందులను విక్రయిస్తున్న మెడికల్ షాపుపై జిల్లా డ్రగ్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. గ్రామంలో పోలెబోయిన భిక్షపతి ప్రభుత్వ అనుమతి లేకుండా మెడికల్ షాపును నిర్వహిస్తున్నాడు. జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ సంపత్‌కుమార్ నేతృత్వంలో దాడులు చేసి రూ.30వేల విలువైన 26 రకాల మందులను సీజ్ చేసినట్లు తెలిపారు. సదరు వ్యక్తిపై డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ యాక్ట్ 1940 ప్రకారం కేసు నమోదు చేసి రామన్నపేట మెజిస్ట్రేట్ ఎదుట రిమాండ్ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా మెడికల్ షాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## స్టోన్ క్రషర్స్‌పై చర్యలు తీసుకోవాలని వినతి

కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం ఇస్తున్న ప్రజా పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ జంగయ్య

బొమ్మలరామారం, సెప్టెంబర్ 27 : మండలంలో నిబంధనలకు విరుద్ధంగా భారీ పేలుళ్లతో నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న స్టోన్ క్రషర్ యూనిట్లపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజాపోరాట కమిటీ జిల్లా కన్వీనర్ మైలారం జంగయ్య అన్నారు. స్టోన్ క్రషర్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టోన్ క్రషర్ వద్ద పేలుళ్ల వల్ల బోరుబావులు పూడిపోతున్నాయని, ఇండ్లు, గోడలకు పగుళ్లు వస్తున్నాయని తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి క్రషర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీస శ్రీనివాస్, సుదర్శన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో కేజీబీవీ విద్యార్థికి సిల్వర్ మెడల్

మోత్కూరు, సెప్టెంబర్ 27 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూడో పోటీల్లో అండర్–14 బాలికల విభాగంలో మున్సిపాలిటీలోని కేజీబీవీ విద్యార్థి కె.అలేఖ్య సిల్వర్ మెడల్ సాధించింది. విద్యార్థినిని ఎంఈఓ తీపిరెడ్డి గోపాల్‌రెడ్డి శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో జూడో కోచ్ అన్నెపు వెంకట్, పాఠశాల ఎస్ఓ యాదమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శంకర్‌నాయక్ కుటుంబానికి నాయకుల ఆర్థిక సాయం

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 27 : మండలంలోని కడపగండి తండాకు చెందిన మాజీ సర్పంచ్ కరంటోతు శంకర్‌నాయక్ అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతిచెందాడు. పేదలైన ఆ కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు ఆర్థిక సాయం చేశారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి రూ.10వేలు, బీఆర్ఎస్ రాష్ట్ర నేత పాల్వాయి స్రవంతి రూ.10 వేలు, మాజీ ఎంపీటీసీ శివరాత్రి కవిత రూ.20వేలు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గడ్డం మురళీధర్‌రెడ్డి రూ.5వేలు, మాజీ సర్పంచ్ పాండురంగనాయక్ రూ.6వేలు, వైస్ ఎంపీపీ రాజు రూ.5వేలు, బానోతు నరేశ్ రూ.5వేలు, జగ్‌రాంనాయక్ రూ.5వేలు, మండల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు కలిపి మరో 80వేల రూపాయలను శంకర్‌నాయక్ కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్రి నర్సింహ, మాజీ సర్పంచులు దోనూరి శేఖర్‌రెడ్డి, చిత్రసేనారెడ్డి, కొండ శ్రీను, జక్కర్తి పాపయ్య, యాదిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు దోటి జంగయ్య, గడ్డం పెంటయ్య పాల్గొన్నారు.

## పెరటి కోళ్ల తో మహిళ లకు జీవనోపాధి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్

మహిళలకు పెరటి కోళ్లు అందజేస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

బీబీనగర్, సెప్టెంబర్ 27 : పెరటి కోళ్లతో మహిళలు జీవనోపాధి పొందవచ్చని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య సభ్యులకు శుక్రవారం పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించాలని ఒక్కొక్కరికి 25 చొప్పున 46మందికి పెరటి కోళ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, కోళ్లను జాగ్రత్తగా పెంచుకుని ఆర్థికంగా ప్రగతి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ కె.శ్రీనివాస్‌రెడ్డి, డీపీఎం ఆనంద్, ఎంపీడీఓ వై.శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ సురేశ్‌రెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, సీసీలు, వీఓఏలు, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

## తాసీల్దార్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

తాసీల్దార్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 27 : తాసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి భూ సంబంధిత సమస్యల గురించి ఆరా తీశారు. ధరణిలో, భూ సమస్యల పరిష్కారంలో ఎదురవుతున్న అంశాలపై చర్చించారు. ధరణి పెండింగ్ ఫైళ్లను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ శాంతినిర్మల

మోటకొండూర్, సెప్టెంబర్ 27 : మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను యాదగిరిగుట్ట ఏడీఏ శాంతినిర్మల, మండల వ్యవసాయాధికారి రమాదేవితో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని రికార్డులు, స్టాక్ వివరాలను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని దుకాణాదారులకు సూచించారు. అనంతరం రైతుల పత్తి పంటను పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ సంధ్య, రైతులు ఉన్నారు.

## చాడ నుంచి పిట్టలగూడేనికి బీటీ రోడ్డు మంజూరు చేయాలి

పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న కల్లూరి మల్లేశం

మోటకొండూర్, సెప్టెంబర్ 27 : మండలంలోని చాడ గ్రామం నుంచి పిట్టలగూడెం గ్రామానికి బీటీ రోడ్డును మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరు మల్లేశం, మండల కార్యదర్శి బొల్గాని జయరాములు కోరారు. పిట్టలగూడెంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం గ్రామ శాఖ మహాసభలో వారు మాట్లాడారు. జిల్లాలోనే అత్యంత వెనుకబడిన పిట్టలగూడేనికి కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. అనంతరం పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. తుమ్మల మల్లేశం, విజయ్, గోపాల్, యాకూబ్, చిన్న చందు, నాయక్, శంకర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలి : సీపీఎం

వలిగొండ, సెప్టెంబర్ 27 : నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని అరూరు గ్రామ